నేరస్తులపై నిఘా..



రౌడీషీట్ నమోదైన వారిని బైండోవర్ చేస్తున్న పోలీసులు

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు
- నేరస్తుల కదలికలపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందం నియామకం

కుత్బుల్లాపూర్: పాత నేరస్తుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లుగా నమోదై ఉన్న వారిని స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గత నెల రోజులుగా అటు బాలనగర్ ఇటు మేడ్చల్ డీసీపీ పరిధిలో బైండోవర్ ప్రక్రియ చేపడుతూ వారికి ప్రత్యేకంగా ఎన్నికల నిబంధనలను వివరిస్తూ ఆర్డీఓ ముందు హాజరు పరుస్తూ ప్రతిరోజు పోలీస్ స్టేషన్ కు వచ్చి సంతకం చేసేలా చర్యలు చేపట్టారు.

మొత్తం 109 మంది రౌడీషీటర్లుగా నమోదు...

◆ జీడిమెట్ల, బాచుపల్లి, దుండిగల్, జగద్గిరిగుట్ట, సూరారం, పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 109 మంది రౌడీషీటర్లుగా నమోదై ఉన్నారు. వీరిలో నలుగురు మినహా 105 మందిని ఇప్పటికే బైండోవర్ చేసి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు.

◆ అత్యధికంగా జగద్గిరిగుట్ట పరిధిలో 36 మందిపై రౌడీషీట్ ఉండగా వారిలో ఒకరు మిస్సింగ్‌లో ఉండగా మరొకరు జైల్లో ఉన్నారు. 34 మందిని స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేకంగా వారిని విచారణ జరిపి పంపించారు.

◆ అదేవిధంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 34 మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఇప్పటికే వారి బైండ్ ఓవర్ ప్రక్రియ పూర్తి చేశారు.

◆ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 14 మందిపై రౌడీషీట్లు ఓపెన్ కాగా 12 మందిని బైండోవర్ చేశారు. మరో ఇద్దరు జైల్లో ఉండటంతో వారి పైనా కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు.

◆ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఎస్ఓటీ, ఎస్‌బీ, టాస్క్ ఫోర్స్ పోలీసులు సైతం వీరిపై నిఘా ఉంచి హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని, గతంలో జరిగిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా కొంతమంది పోలీసులను నియమించినట్లు తెలిసింది.

అతిక్రమిస్తే ఇక అంతే..

◆ బైండోవర్‌లో భాగంగా రౌడీషీటర్లను వివిధ నేరాల్లో పాల్గొన్న అనుమానితులను ఆర్డీఓ ఎదుట హాజరు పరిచి సదరు వ్యక్తుల నుంచి రూ. లక్ష పూచికత్తుతో లిఖితపూర్వకంగా బాండ్ రాసి ఇస్తారు. బైండోవర్ చేసిన వ్యక్తులు సంవత్సరం లోపు ఏదైనా నేరాలకు పాల్పడితే నేరం చేసిన వారిపై 24 గంటల్లో కేసు నమోదు చేసి వారిని జైలుకు పంపుతారు. మీరు ఎన్నికల సమయంలో గుంపులుగా తిరిగినా, నేరాలకు పాల్పడినా, ప్రవర్తనలో మార్పు రాకపోయినా, సమాజంలో అశాంతిని రేకెత్తించినా, ఎన్నికల సమయంలో రిగ్గింగ్‌లకు పాల్పడడం, పోలింగ్ స్టేషన్ల వద్ద హడావిడి చేయడం వంటి గొడవలకు దిగే వారిని గుర్తించి రౌడీషీట్ ఓపెన్ చేస్తారు.

బైండోవర్ అంటే...

◆ ఎన్నికల సమయంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం అమ్మేవారు, రౌడీషీటర్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు, ఎన్నికల సమయంలో పోలింగ్ స్టేషన్ల వద్ద గొడవకు దిగే వారిని ప్రత్యేకంగా గుర్తించి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తూ ప్రతి ఎన్నికలకు ముందు వారిని సెక్షన్ 110 సీఆర్‌పీసీ ద్వారా బైండోవర్ చేస్తూ ఆర్డీఓ , తహసీల్దార్ సమక్షంలో విచారించి సొంత పూచికత్తుపై విడిచిపెడతారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని లిఖితపూర్వకంగా హామీ పత్రం తీసుకుంటారు. వీరిపై ఎప్పటికప్పుడు పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఎక్కడైనా గొడవలకు ఆస్కారం ఉంటే వీరిని అదుపులోకి తీసుకుంటారు.

నిర్వహణ గాలికి.. పచ్చదనం పశువులకు!



దుండిగల్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మొక్కలను మేస్తున్న పశువులు

సుభాష్‌నగర్: దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు, నర్సాపూర్ రాష్ట్ర రహదారికి అనుసంధానంగా ఉన్న రింగ్‌రోడ్డు వద్ద లక్షలు వెచ్చించి పెంచిన పచ్చదనాన్ని అధికారులు గాలికి వదిలేసారు. చుట్టూ ఎలాంటి కంచె లేకపోవడంతో సంవత్సరాల తరబడి పెంచిన పచ్చదనం పశువులకు ఆహారంగా మారింది. మంగళవారం దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద పదుల సంఖ్యలో పశువులు గ్రీనరీని మేస్తుండగా ఆ దృశ్యం 'సాక్షి'కెమెరాకు చిక్కింది. చెట్లను మేయడమే కాకుండా వాహనదారుల రాకపోకలకు పశువులు ఇబ్బందిగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యూసుఫ్ మృతి ఎంసీపీఐ(యూ)కి తీరని లోటు



యూసుఫ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

కుత్బుల్లాపూర్: ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు యూసుఫ్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. గురువారం ఆయన మృతదేహానికి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనం సుధాకర్, కుంభం సుకన్య, గ్రేటర్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్, సహాయ కార్యదర్శి అనీల్‌కుమార్, తాండ్ర కళావతి నివాళులర్పించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు తుదిశ్వాస వరకు కట్టుబడి పేద ప్రజల హక్కుల సాధన కోసం యూసుఫ్ కృషి చేశారని వక్తలు కొనియాడారు. మేడ్చల్ జిల్లా ఎంసీపీఐ(యూ) నాయకులు దశరథ్ నాయక్, బిర్జుసింగ్, రాజు, రవీందర్‌గౌడ్, రవి తదితరులు ఉన్నారు.

మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట



మైనార్టీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కుత్బుల్లాపూర్: మైనార్టీల సంక్షేమానికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీటవేసి వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు.ఈనెల 6న మైనార్టీ నాయకుల సమావేశం నేపథ్యంలో గురువారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బీఆర్ఎస్ మైనార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి రాగాడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మైనార్టీలకు అన్ని విధాలుగా ఉండగా ఉండేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. మైనార్టీ సమావేశాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. మహమ్మద్ రఫీ, మక్బుద్ అలీ, డాక్టర్ హుస్సేన్, యూసుఫ్, సలీం జావిద్ బేగ్, ఇబ్రహీం ఖాన్, ఫిరోజ్, మోయిజ్, అర్షద్, నదీమ్, శన్ను, మూసాఖాన్, మంజూర్ అలీ తదితరులు ఉన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు పాటుపడతా



సుబ్రమణ్యంకు చెక్కు అందజేస్తున్న కార్మిక నేత మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కుల కోసం తాను నిరంతరం పోరాడుతానని కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని శోధన లేబరేటరీస్ పరిశ్రమలో సుబ్రమణ్యం అనే కార్మికుడు ఆరు సంవత్సరాల నుంచి షిఫ్ట్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. కాగా గతంలో రియాక్టర్‌కు బ్యాచి వేసే క్రమంలో కొద్దిగా మంటలు చెలరేగాయి. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహించాడని యాజమాన్యం అతడిని పనుల నుంచి తొలగించింది. అకారణంగా తనను విధుల నుంచి తొలగించారని, ఆరు నెలల నుంచి తన కుటుంబ పోషణ భారంగా మారిందని సుబ్రమణ్యం కార్మిక నేత మదన్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి రూ.1.10 లక్షలు నష్టపరిహారం ఇచ్చే విధంగా ఒప్పించాడు. సదరు మొత్తాన్ని మదన్‌గౌడ్ గురువారం సుబ్రమణ్యంకు అందజేశాడు. కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం పాటు పడతానన్నారు. కార్యక్రమంలో కె.సుభాష్, కె.రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

జగద్గిరిగుట్ట: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం ఉషోదయకాలనీలోని పార్కులో గురువారం ఓ యువకుడు అభస్యకర చేష్టలతో మహిళలను ఇబ్బందులకు గురిచేయసాగాడు. దీంతో స్థానిక యువకులు అతడికి దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు సదరు యువకుడిని విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కొత్తవారు సంచరిస్తే వెంటనే తమ సమాచారం అందజేయాలని పోలీసులు పేర్కొన్నారు. ఆకతాయి విషయంలో వెంటనే స్పందించిన పోలీసులను కాలనీవాసులు అభినందించారు. కాగా యువకుడి వివరాలు తెలియరావాల్సి ఉంది.



ఆకతాయిని అదుపులోకి తీసుకుంటున్న జగద్గిరిగుట్ట పోలీసులు

బోరు అడుగంటింది.. పంట ఎండింది.!



మెట్‌కానిగూడలో తన పంట ఎండడంతో పశువుల మేత కోసం కోస్తున్న రైతు పెంటయ్యయాదవ్

సుభాష్‌నగర్: ఒకవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు జోరుగా నిర్మాణాలు. చుట్టుప్రక్కల ఇక్కడ చూసిన ఇంటి నిర్మాణం కోసం 24 గంటల పాటు నడిచే బోర్లు. గత పదేళ్ల నుంచి ఎప్పుడు లేని విధంగా నగరంలో వ్యవసాయ సాగు చేస్తున్న ఆ రైతు వేసిన పంట ఈసారి బోరు అడుగంటడంతో ఎండింది. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడకు చెందిన రైతు పెంటయ్యయాదవ్ సంవత్సరంలో రెండు పంటలు సాగు చేస్తుండగా ఈసారి మండుతున్న ఎండలకు బోరు అడగంటడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో మధ్యలోనే ఆ పంటలు కోసి పశువులకు అందించాడు.

ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా

స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీప్రసాద్

నాగోలు: ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. గురువారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోలు, బండ్లగూడ, ఉప్పల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవీప్రసాద్ మాట్లాడుతూ... మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని యువత, మహిళలకు స్థానిక పరిశ్రమల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించడం తన లక్ష్యమన్నారు.

సీఎం రోడ్ షో.. జీత్ కాంగ్రెస్ కో.!

మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీతకు మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం

కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డికి మద్దతుగా షాపూర్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, కవితలపై వేసిన సెటైర్లు.. గాడిద గుడ్డు పేరుతో ప్రధాని మోదీని విమర్శిస్తూ కార్యకర్తలతో నినాదాలు చేయించారు.

▫ ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి బరిలో నిలబడ్డ తనకు కుత్బుల్లాపూర్ ప్రజలు అండగా ఉండాలని కోరారు. రంగారెడ్డి జిల్లాతో అనుబంధంగా ఉన్న తనను ఈ ప్రాంత ప్రజలు ఎన్నోసార్లు అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు.

▫ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... కొంపల్లి దుండిగల్ మున్సిపాలిటీలతో పాటు నిజాంపేట్ కార్పొరేషన్‌కు అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రత్యేక నిధుల కింద రూ.75 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కుత్బుల్లాపూర్ అభివృద్ధి చెందిందని తెలిపారు. నాడు కొడంగల్ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తే మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపీగా పట్టంకట్టి ఢిల్లీకి పంపించారని గుర్తుచేశారు. అదే తరహాలో పట్నం సునీతారెడ్డిని సైతం గెలిపించాలని కోరారు.



సీఎంకు గదను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

▫ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తప్పకుండా మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

▫ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుండగా ఓ యువకుడు టమాట సంచితో కాన్వాయ్ పక్కనే నిలబడి ఉండగా బాలానగర్ డీసీపీ శ్రీనివాస రావు గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేసి అతన్ని పక్కకు పంపించి తనిఖీలు చేపట్టారు.

▫ సాయంత్రం 6 గంటలకు సమయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తారని పెద్ద ఎత్తున నియోజకవర్గం నుంచి తరలివచ్చిన కార్యకర్తలు మూడు గంటలుగా సీఎం రేవంత్‌రెడ్డి రాక కోసం ఎదురు చూశారు. రాత్రి 9 గంటల సమయానికి షాపూర్‌నగర్‌కు చేరుకున్న రేవంత్‌రెడ్డికి కార్యకర్తలు భారీ స్వాగతం పలికారు. సుమారు 23 నిమిషాల పాటు రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని కొనసాగించారు.

▫ ముఖ్యమంత్రి రాక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కుత్బుల్లాపూర్ పార్టీ ఇన్‌చార్జి కొలను హనుమంత్‌రెడ్డి పెద్ద ఎత్తున ఫ్లెక్సీలతో స్వాగత ఏర్పాట్లు చేశారు. సాగర్ హోటల్ సమీపంలో సమావేశం జరుగుతున్న తరుణంలో పలువురు కార్యకర్తలు, మహిళలు రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో వెళ్లిపోవడం కనిపించింది.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

దుండిగల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఎస్ఎంఈ అసోసియేట్ ఫ్యాకల్టీ మెంబర్ శరత్ ముత్యాల అన్నారు. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో గురువారం పృథ్వీ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శరత్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పృథ్వీ ఈవెంట్ ఎర్త్ డే స్ఫూర్తిని నింపిందన్నారు. పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పెంపొందించే విధంగా తమ కళాశాల ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ, వేస్ట్ టు వెల్త్, డిజిటల్ పోస్టర్, డ్రాయింగ్ వంటి వివిధ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావు, డీన్ రాధిక దేవి, వివిధ విభాగాల హెచ్‌ఓడి లు అచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బలరాం, హరిప్రియ, మోనాజ్, వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

అకాడెమియా-పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడమే లక్ష్యం

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: అకాడెమియా- పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఎస్కీ- జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(జీఎన్ఐటీఎస్)మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పరిశోధనలు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, పరిశ్రమ ఆధారిత నైపుణ్యం పెంపుదల కోర్సులకు ఇది వేదికగా నిలుస్తుందన్నారు. ఇంజనీరింగ్ విద్యలో విప్లవాత్మక మార్పులపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు.